ఆటోవాలా..అడ్డుకునేదెలా?

ఇష్టారాజ్యం..
గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బస్సులు బయటకు వచ్చేటప్పుడు.. లోపలకు వెళ్లేటప్పుడు కొందరు ఆటోవాలాలు ప్రవర్తించే తీరు అటు ప్రయాణికులకు, ఇటు బస్సు డ్రైవర్లకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది.

- గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అడ్డదిడ్డంగా ఆటోలు
- ప్రయాణికుల పట్ల కొందరు ఆటోవాలాల దురుసు ప్రవర్తన
- బస్సులు వెలుపలకు వచ్చే సమయంలో డ్రైవర్లకు తప్పని ఇక్కట్లు
- నియంత్రించాలంటున్న ప్రయాణికులు



గూడూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలిపిన ఆటోలు

చిల్లకూరు: గూడూరు ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పాత బస్టాండ్ ప్రాంతంలో పలువురు ఆటోవాలాలు ఎక్కడపడితే అక్కడ ఆటోలను నిలుపుతున్నారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్ నుంచి వెలుపలకు బస్సు బయలుదేరే సమయంలో ప్రయాణికులు త్వరగా బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో ఆటోవాలాలు అడ్డుగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక పాత బస్టాండ్ ప్రాంతంలో అయితే ఎక్కడికక్కడే ఆటోలను నిలిపి వేస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో వారి ప్రవర్తన అందరికీ ఇబ్బంది కలుగుతోంది. గతంలో ఆటోవాలాలను నియంత్రించేందుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఒక హోంగార్డు ఉండేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో ఆటోవాలాలకు ఇష్టారాజ్యమైంది. అలాగే పాత బస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీసులు ఒక వైపు ఆటో వాలాలను హెచ్చరిస్తున్నప్పటికీ.. లెక్కలేనితనంతో వ్యవహరిస్తున్నారు.

మామూళ్లు తీసుకుంటూ..
అయితే బస్టాండ్ ప్రాంతంలో అడ్డదిడ్డంగా ఆటోలు నిలుపుతున్నా అడిగేవారు లేరు. దీంతో వారు ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. పైగా కొందరు పోలీసులు నిత్యం ఆటోవాలాల వద్ద మామూళ్లు తీసుకోవడం వల్లే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇకనైనా ఆర్టీసీ అధికారులు చొరవ తీసుకుని ఆటోవాలాలను నియంత్రించాలని కోరుతున్నారు.



పాత బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే నిలిపిన ఆటోలు

డీఎస్పీ దృష్టికి తీసుకెళ్తాం..
ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఆటోలను నియంత్రించే విషయమై డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును సంప్రదించగా గతంలో అక్కడ హోంగార్డు ఉండేవారన్నారు. ప్రస్తుతం నియంత్రించేవారు లేకపోవడంతో డీఎస్పీ గీతాకుమారిని కలసి సమస్యపై వినతిపత్రం అందిస్తామని తెలిపారు.



క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న వెంకటగిరి మున్సిపల్ కమిషనర్

తిరుపతి అర్బన్: వెంకటగిరి పట్టణంలో తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. వెంకటగిరి పురపాలక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటరామయ్య మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అన్ని వార్డులను సందర్శించాలని సూచించారు. సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



భోజనాన్ని పరిశీలిస్తున్న ఖాజామొహిద్దీన్

రాపూరు: ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకుంటారని జిల్లా ఉర్దూ స్కూళ్ల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ అన్నారు. రాపూరులోని ఉర్దూ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. త్వరలో జరగనున్న ఎఫ్ఏ 4 పరీక్షల సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను సంసిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం హబీబా, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న 9వ బెటాలియన్ అధికారులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ అరుణ్‌బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌కన్నా ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. విపత్తు సంఘటనలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానం, ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై బెటాలియన్ సిబ్బంది చే విన్యాసాలు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్ఎస్ఎన్ శెట్టి, ఆర్ఎస్ఐ ప్రశాంత్, ఎస్టీఆర్ఎఫ్ సిబ్బంది, హెచ్‌ఎం రజని ఉన్నారు.

శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: అంగన్‌వాడీ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలో మంగళవారం జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 3–8 ఏళ్ల వయసు కలిగిన పిల్లలకు అక్షర, గణిత పునాదులు అంగన్‌వాడీ కేంద్రాల్లో బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా పిల్లలకు ఆటపాటల ద్వారా పిల్లల అభ్యసనను మెరుగు పరచడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు దయాకర్, సుప్రియ, రాపూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్లు సౌజన్య, ఎస్‌కే ఫాతిమా తదితరులు ఉన్నారు.

కూరగాయల పంపిణీ



దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

గూడూరురూరల్ : పేదవారికి సాయం అందించాలనే లక్ష్యంతో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోటేశ్వరావు, భారతి దంపతుల దాతృత్వంతో మంగళవారం పట్టణంలోని మాయాబజార్ ప్రాంతంలో వృద్ధులు, వికలాంగులకు కూరగాయలు పంపిణీ చేశారు. పేదవారిని గుర్తించి వృద్ధులు, దివ్యాంగులకు చేయూత ఇవ్వడం జరిగిందని ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, రమేష్, రమణయ్య, కోటేశ్వరరావు, భారతి, తదితదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

కోట: స్థానిక ఏవీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాఠశాల పూర్వ విద్యార్థులు సాయం అందించినట్లు హెచ్‌ఎం సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. 1980–81 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు అందించిన సాయంతో ప్రహరీ నిర్మాణం, పాఠశాల పరిసరాల్లో 20 బెంచీలు ఏర్పాటు, గేటు మరమ్మతులు, క్రీడాసదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. రూ.2 లక్షల వరకు వెచ్చించి పాఠశాల అభివృద్ధికి చేయూతనందించిన పూర్వ విద్యార్థులను ఆయన అభినందించారు.

20న రక్తదాన శిబిరం



మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

కోట: మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 90వ జయంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. నేదురుమల్లి అభిమానులు, ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాలుపంచుకోవాలని కోరారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2018 నుంచి ఏటా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు గుర్తింపు దక్కిందన్నారు. రక్త సేకరణలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచినందుకు రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా అవార్డులు అందుకోవడం జరిగిందన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



పరంధామరెడ్డిని పరామర్శిస్తున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కూచివాడ పరంధామరెడ్డిని మంగళవారం వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల పరంధామరెడ్డి తల్లి యశోదమ్మ మృతి చెందారు. మంగళవారం ఆయన వారి నివాసానికి చేరుకుని యశోదమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పరంధామరెడ్డి, సోదరులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నాగూర్‌రెడ్డి, శేషురెడ్డి, రఘురామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీహరిరెడ్డి తదితరులు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న వామపక్ష నాయకులు

గూడూరురూరల్ : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ ప్రాంతంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీపీఎం, సీపీఐ, వామపక్ష నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ ఆర్గనైజర్ జోగి శివకుమార్ మాట్లాడుతూ దేశాన్ని, ప్రజలను కొల్లగొట్టేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూస్తే సామాన్యులను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు సంపదను సమర్పించుకునే బడ్జెట్‌లా ఉందని దుయ్యబట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా మొదలైన నిరసన కార్యక్రమాలు 18, 19 తేదీల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 20న నిరసన చేపడతామని, ప్రజా సంఘాలు, సానుభూతిపరులు, అభిమానులు, రైతులు, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

8న జాతీయ లోక్‌అదాలత్



లోక అదాలత్‌పై సమీక్షిస్తున్న న్యాయమూర్తులు

గూడూరురూరల్ : కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 8న గూడూరు కోర్టులో నిర్వహిస్తున్నట్లు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీనా సుల్తానా బేగం తెలిపారు. గూడూరు కోర్టులో మంగళవారం న్యాయమూర్తులు, పోలీసులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంకు, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, భూతగదాలతో పాటు ఇరువర్గాల సమ్మతితో కేసులను పరిష్కరించుకునే వీలుంటుందని తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని పిలుపునిచ్చారు. అధికారులతో పాటు పోలీసులు చొరవ తీసుకుని లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. సమీక్షలో సీనియర్ సివిల్‌జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బీవీ సులోచనరాణి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్య, సీనియర్ ఏపీపీ లక్ష్మీనారాయణ, భాస్కరరావు, గూడూరు డీఎస్పీ గీతాకుమారి, న్యాయవాదులు కోటేశ్వరరావు, మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల్లో ఆన్‌లైన్ సేవలు



మాట్లాడుతున్న జిల్లా జీఎం సరిత

నాయుడుపేటటౌన్ : కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుకు సంబంధించిన అన్ని సహకార సంఘ శాఖల్లో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ సేవలు అందించేలా పనులు జరుగుతున్నాయని కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు జిల్లా జీఎం సరిత తెలిపారు. అంతర్జాతీయ కోఆపరేటివ్–2025 పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం నాయుడుపేట కోఆపరేటివ్ బ్యాంకులో 35కు పైగా కోఆపరేటివ్ సొసైటీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం సరిత మాట్లాడుతూ జిల్లాలోని కోఆపరేటివ్ బ్యాంకులతో పాటు వాటిని అనుసంధానంగా ఉన్న సొసైటీ బ్యాంకులను కంప్యూటీకరణ చేసి వినియోగదారులకు ఆన్‌లైన్ సేవలను అందించడం జరుగుతుందన్నారు. తద్వారా బ్యాంకుకు సంబంధించి అనేక రకాలు సేవలను పారదర్శంగా అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. కంప్యూటరీకరణ వల్ల అవకతవకలకు చెక్ పెట్టినట్లు అవుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని కోఆపరేటివ్ బ్యాంకుల కంప్యూటరీకరణ చేపట్టి వినియోగదారులకు ఆన్‌లైన్ విధానంలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. సొసైటీ బ్యాంకుల్లో కూడా అన్ని రకాల సేవలను కంప్యూటీకరణ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయుడుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హరికృష్ణ సొసైటీల సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

50 సెంట్ల భూమి కేటాయింపు



మున్సిపాలిటీకి కేటాయించిన స్థలం వద్ద కొలతలు వేస్తున్న సర్వేయర్, కమిషనర్లు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మున్సిపల్ కార్యాలయానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 50 సెంట్ల భూమి కేటాంచారు. ఈ మేరకు పట్టణంలోని పాత రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం సర్వేయర్ చరణ్‌తో పాటు రెవెన్యూ అధికారులు మున్సిపల్ కార్యాలయానికి కేటాయించిన స్థలం వద్ద సర్వే చేపట్టి హద్దు రాళ్లు నాటించారు. తుమ్మూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 301లో 50 సెంట్ల భూమిని మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణానికి కేటాంచారు. పాత రెవెన్యూ కార్యాలయం వద్ద 50 సెంట్ల భూమిలో నాయుడుపేట మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా వెల్లడించారు. కమిషనర్ దగ్గర ఉండి మున్సిపాలిటీకి కేటాయించిన భూమికి హద్దు రాళ్లు నాటించారు. ఇప్పటికే పాత రెవెన్యూ కార్యాలయం భవనాన్ని మున్సిపాలిటీకి సంబంధించి వస్తువులను పెట్టుకునేందుకు వినియోగిస్తున్నారు. పాత రెవెన్యూ కార్యాలయం వద్ద కేటాంచిన 50 సెంట్ల స్థలంలో మున్సిపల్ కార్యాలయ నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

21న జాబ్‌మేళా

గూడూరురూరల్: పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈ నెల 21న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. కళాశాలలో ఆయన మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలకు చెందిన యాజమాన్యాలు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రీన్ టెక్, వీల్స్ ఇండియా, బ్లూస్టార్, క్లయిమాటిక్, ఇంటెల్, ముత్తూట్ తదితర కంపెనీలకు చెందిన వారు ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన వారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌తో పాటు విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 8639835953లో సంప్రదించాలన్నారు.

కండలేరులో 52.978 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 52.978 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పక్కా గృహం మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం దొరవారిసత్రం ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలో హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పక్కాగృహాలు, నివేశ స్థలాల కోసం అధిక సంఖ్యలో తనకు అర్జీలు ఇచ్చారు. వీటిపై ఆయా శాఖల అధికారుల మాట్లాడి అర్హత ఉన్న అందరి గృహాలు, నివేశ స్థలాలు అందజేయడం జరుగుతుందన్నారు. పక్కాగృహాలు మంజూరు విషయం క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, హౌసింగ్ డీఈ సత్తయ్య, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నాయకులు శ్రీహరిరెడ్డి, ఉదయ్‌కుమార్, మనోహర్‌రెడ్డి, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్



సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అగస్త్య ఫౌండేషన్ సంస్థ వారు పాఠశాల విద్యార్థులకు మంగళవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీపై తగిన అవగాహన కల్పించేందుకు సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు తెలియజేశారు. ఫౌండేషన్‌కు సంబంధించి సైన్స్ ఉపాధ్యాయులు నీరజ, పోలమ్మ సారథ్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు ఎస్‌కే అక్బర్, శ్యామల, సునీల విద్యార్థులతో సైన్స్ ఉపకరణాలను తయారు చేయించి ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయండి



సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేదురుమల్లి, మేరిగ



డీఎస్పీ గీతాకుమారిని మర్యాద పూర్వకంగా కలసిన నేదురుమల్లి, మేరిగ

– అధికారులను కలసిన నేదురుమల్లి, మేరిగ

చిల్లకూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారిని వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ కోరారు. మంగళవారం వారు మర్యాద పూర్వకంగా అధికారులను కలిసి పలు సమస్యలను విన్నవించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాఘవేంద్రమీనా దృష్టికి రెండు నియోజకవర్గాలలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు ఇచ్చిన నివేశ స్థలాలను అనర్హత పేరుతో తొలగించేందుకు శ్రీకారం చుడుతున్నారని, వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తీర ప్రాంతంలో ఏర్పాటవుతున్న క్రిస్ సిటీకి సంబంధించిన భూ సేకరణలో భూములు కోల్పోయిన వారికి పరిహారం వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు. దీనిపై సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాత పూర్వకంగా సమస్యలను తెలియజేస్తే వాటిని సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం గూడూరు డీఎస్పీ గీతాకుమారిని కలసి రెండు నియోజకవర్గాల్లో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు, దాడుల వ్యవహారాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై ఆమె స్పందిస్తూ ఇటీవలే తాను బాధ్యతలు చేపట్టానని, ఏదైనా సమస్య వచ్చినప్పుడు తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం వారు పార్టీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి పలు విషయాలపై చర్చించారు. వారి వెంట పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మెట్టా రాధాకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, గూడూరురూరల్ అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అసైన్డ్ భూములకు రెక్కలు



పూతలపట్టు-నాయుడుపేట రహదారి పక్కన అసైన్డ్ భూములు

– హైవే నిర్మాణంతో భూములకు డిమాండ్

పెళ్లకూరు: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు పూర్తి కావస్తుండడంతో రహదారికి ఇరువైపులా ఉన్న అసైన్డ్ భూములకు ఊహించని డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. నాయుడుపేట-శ్రీకాళహస్తి పట్టణాలను కలిపే జాతీయ రహదారికి ఇరువైపులా పలు గ్రామాల్లో వందల ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నాయి. ముఖ్యంగా పెళ్లకూరు, చిల్లకూరు, అక్కగారిపేట, భీమవరం, చెంబడిపాళెం తదితర గ్రామాల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న అసైన్డ్ భూములను గతంలో ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసింది. అయితే కొన్ని ప్రాంతాల్లో సాగు నీటి సౌకర్యం లేకపోవడంతో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఏడాదికి ఒక పంట సాగు చేసుకుంటున్నారు. జాతీయ రహదారి ఏర్పాటు చేయకమునుపు ఒక ఎకరం అసైన్డ్ భూమి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలలోపు ఉండేది. జాతీయ రహదారి ఏర్పాటుతో ప్రస్తుతం రూ.60 లక్షలు నుంచి రూ.కోటి పలుకుతుండడం విశేషం. అసైన్డ్ భూములను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమైనప్పటికీ కొందరు కొనుగోలు చేస్తూ రిజిస్ట్రేషన్ కూడా చేసుకుంటున్నట్లు సమాచారం. నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాలకు చెందిన రియల్టర్లు స్థానిక మధ్యవర్తులతో మంతనాలు చేసి కొనుగోలు చేస్తున్నారు. అదేవిధంగా రహదారి ఏర్పాటుకు ఒక ఎకరం రూ.కోటి ఉన్న పట్టా భూములు ప్రస్తుతం రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల ధర పలుకుతున్నాయి. దాంతో రహదారికి ఇరువైపులా చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగించే పేదలు సెంటు స్థలం కొనాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.